## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


గాగిళ్లాపూర్‌లో బొల్లు ఎలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 20 : మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో ఇటీవల మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యనారాయణ శర్మ, గాగిళ్లాపూర్‌లో బీఆర్‌ఎస్ మండల నాయకుడు బొల్లు చంద్రమౌళి తండ్రి బొల్లు ఎల్లయ్య మృతి చెందడంతో వారి కుటుంబాలను జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో లంబ లింగయ్య, యాసరేణి నర్సింహులు, బందారం పద్మ కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోశ్ కుమార్, మంద యాదగిరి, మాజీ ఎంపీపీలు బద్దిపడగ కృష్ణారెడ్డి, ఉల్లంపల్లి కరుణాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాలనర్సయ్య, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షులు చొప్పరి వరలక్ష్మీసాగర్, పెడుతల ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, నాయకులు జింకల పర్వతాలు, శివగారి అంజయ్య, తాళ్లపల్లి భిక్షపతి, దామెర మల్లేశం, తవిటి యాదగిరి, మేక ఉమామహేశ్వర్, ఇట్టమైన కనకయ్య, పుప్పాల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

### చేర్యాల ఎమ్మెల్యే 'పల్లా' పర్యటన

చేర్యాల, సెప్టెంబర్ 20 : పట్టణంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పర్యటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి శ్రీధర్‌రెడ్డి దంపతుల మనవడి పుట్టిన రోజు వేడుకలను పట్టణంలోని శ్రీ రేణుక గార్డెన్స్‌లో నిర్వహించడంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వేడుకకు హాజరై బాబుకు ఆశీస్సులు అందించారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో గడితోటకు చెందిన పుల్లన్నగారి శ్రీకాంత్ అనే యువకుడు, ఆయన తాత ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధి త కుటుంబాన్ని పరామర్శించారు.

### రైతులకు అండగా బీఆర్‌ఎస్ : ఎమ్మెల్యే

పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానిక శ్రీ సాయిశివ ఫర్టిలైజర్స్ షాపును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూడాలని, షాపుల యాజమాన్యాలతో పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను షాపు యజమాని, బీఆర్‌ఎస్ నేత చేతిరెడ్డి సందీప్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజమల్లారెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రోల్ల రామచంద్రం, పుల్ల రవి, బుట్టి శ్రీను, ఎలుగల సంపత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


చేర్యాలలో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేత సందీప్‌రెడ్డి

## ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించిన డీఈవో

నారాయణరావుపేట, సెప్టెంబర్ 20 : మండల కేంద్రమైన నారాయణరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను కూడా అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), సెప్టెంబర్ 20 : విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి జడ్పీ పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్ బక్కి భాగ్యమ్మ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సహకారంతో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ టోర్నీ క్రీడలను డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో సదానందం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యం కనబర్చి జాతీయ స్థాయి క్రీడలకు ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో జోగు ప్రభుదాస్, మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, నాయకులు బాలాగౌడ్, సూకురి లింగం, ప్రతాప్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


మిరుదొడ్డి: భూంపల్లిలో క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న బక్కి వెంకటయ్య

## వైద్యం వికటించి మహిళ పరిస్థితి విషమం

**ఆర్‌ఎంపీ వల్లనే తన భార్య విషమ పరిస్థితుల్లో ఉందని భర్త ఆరోపణ**

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 20 : కొండపాక మండలంలోని దుద్దెడలో ఆర్‌ఎంపీ వైద్యంతో ఓ మహిళకు వైద్యం వికటించి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. బాధితురాలు భర్త తేలు నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మం డలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెం దిన తేలు మహేశ్వరి కాళ్ల నొప్పులు వేధిస్తున్నాయని భర్తతో కలిసి దుద్దెడలోని ఆర్‌ఎంపీ ఆంజనేయులు వద్దకు వెళ్లింది. ఆమెను పరిశీలించిన సదరు ఆర్‌ఎంపీ ఆమెకు సెలైన్ పెట్టాడు. దీంతో మహేశ్వరి వాంతులు చేసుకోవడంతో వెంట నే ఆమెకు ఇంజక్షన్ చేశాడు. కాసేపటికే బా ధితురాలు కళ్లు తేలేసి స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను అక్కడే వదిలేసిన ఆర్‌ఎంపీ ఆంజనేయులు తనకు అత్యవసర పని ఉందని సిద్దిపేటకు వెళ్లిపోయాడు. మహేశ్వరి పరిస్థితి విషమంగా ఉందని గమనించిన భర్త నర్సింహులు వెంటనే ఆమెను ఆటోలో సిద్దిపేటలోని ఒక ప్రైవేటు దవాఖానకు తీసుకువెళ్లాడు. అక్కడ బాధితురాలిని పరీక్షించిన వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించాడు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్యంగా ఉన్న తన భార్యకు ఆర్‌ఎంపీ చేసిన వైద్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

గజ్వేల్, సెప్టెంబర్ 20 : గజ్వేల్ మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదట ధర్నా నిర్వహించి కమిషనర్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీఆర్సీ కనీస వేతనం 26 వేలు అందించాలన్నారు. రోజువారి కార్మికులకు ఈఎస్ఐపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కుమార్, సంతోశ్, వెంకటేశ్, యాదగిరి, నర్సింహులు, లక్ష్మి, యాదమ్మ, సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ చెరువు పెద్దతూము లీకేజీ


హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు పెద్ద తూము నుంచి వృథాగా పోతున్న నీళ్లు

- పట్టించుకోని నీటి పారుదల శాఖ అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

హుస్నాబాద్, సెప్టెంబర్ 20 : హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు పెద్ద తూము లీకేజీ కారణంగా చెరువులోని నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. చెరువు నిండి ఇరువై రోజులైనా ఈ లీకేజీని అరికట్టడంలో స్థానిక నీటిపారుదల శాఖ అధికారులు విఫలమవుతున్నారు. తూము ద్వారా ధారాళంగా నీరు పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువు కావడం, అప్పుడే నిర్మించిన తూము కావడంతో దీనికి మరమ్మత్తులు చేయడం గానీ, ఆధునిక ఏర్పాట్లు చేయడం గానీ చేయకపోవడం వల్ల ఏటా చెరువు నీళ్లు వృథా గా పోతున్నాయి. పెద్ద తూము వద్ద తాత్కాలికంగా సిమెంటుతో నిర్మాణం చేపట్టినప్పటికీ తూము గేట్లను సరిగ్గా అమర్చడంలో అధికారులు విఫలమయ్యారు. వానకాలం ప్రారంభమైన మూడు నెలల అనంతరం ఇటీవల కురిసిన తుఫాను వానలతో ఎల్లమ్మ చెరువు పూర్తిగా నిండి మత్తడి పడింది. చెరువు నిండటంతో ఆయకట్టు రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కానీ పెద్ద తూము లీకేజీ వల్ల చెరువులోని నీళ్లు మొత్తం వృథాగా పోతాయనే ఆందోళనకు గురవుతున్నారు.

### సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టు..

హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువుకు 0.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. సుమారు 600 ఎకరాల శిఖం భూమి ఉంది. ఈ చెరువు పూర్తిగా నిండితే యాసంగి సీజన్‌లో ప్రత్యక్షంగా 3 వేల ఎకరాలకు, పరోక్షంగా మరో రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఇలాంటి చెరువు నుంచి పెద్ద ఎత్తున నీరు లీకేజీ అవుతున్నా పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పలు మార్లు నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నీరు ఇలాగే పోతే నెల రోజుల్లోపే చెరువులోని నీళ్లన్నీ ఖాళీ అవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకొని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ద్వారా చెరువు తూము లీకేజీకి అడ్డుకట్ట వేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. లేకుంటే యాసంగి సీజన్‌లో ఆయకట్టులో పంట సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తక్షణమే పరీక్షించి చికిత్స అందించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట కలెక్టరేట్,సెప్టెంబర్ 20 : వైద్యాధికారులు ప్రతి పిల్లవాన్ని తక్షణమే పరీక్షించి చికిత్స అందించాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సంక్షేమ శాఖ సమన్వయంతో జిల్లాలోని వైద్యాధికారులకు సీడీపీవోలకు, వైద్యశాఖ సూపర్‌వైజర్లకు, సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లకు పర్యవేక్షణ అనుబంధ పోషకాహార కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైనింగ్ ఆఫీసర్ నరసింహారావు జూమ్ ద్వారా పాల్గొని ఎస్‌ఎస్‌పీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్‌హెచ్‌ఎన్ డా క్టర్ ఆనంద్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, డాక్టర్ నారాయణ, ఐసీడీఎస్ శాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

## కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎర్రగడ్డ దవాఖానకు పంపాలి

**సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి, సెప్టెంబర్ 20 : జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మానసిక పరిస్థితి బాగాలేదని, ఆయనను వెంటనే ఎర్రగడ్డ దవాఖానకు పంపాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నా రు. శుక్రవారం కొమురవెల్లి మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమ్మూరి ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఆయనను సొంత పార్టీ కార్యకర్తలే వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో అనేక భూములు కొనుగోలు చేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించాడన్నారు. వాటిలో అనైతిక కార్యక్రమాలు జరుగుతున్నాయని విచారణ వేయాలన్నారు. చేర్యాలలో కొమ్మూరి కట్టిన ఇల్లు హైడ్రా కిందకు వస్తుందని, దానిని వెంటనే బుల్డోజర్లతో కూలగొట్టాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, బి. కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, బోయిని మల్లేశం, కర్రోళ్ల ఎల్లయ్య, ఆరుట్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో తల్లీ, కూతురు ఆత్మహత్య


తల్లీ కూతుర్లు స్పందన,శారద (ఫైల్)

బెజ్జంకి, సెప్టెంబర్ 20 : కుటుంబ కలహాలతో తల్లి, కూతురు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు కథనం మేరకు.. జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన సాంబారి రాజేశ్వర్, సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వడ్నాల శారదకు 20 ఏండ్ల కింద వివాహం జరిగింది. వీరికి స్పందన (14), కుమారుడు రఘువరణ్ (9) ఉన్నారు. రాజేశ్వర్ జీవనోపాధి కోసం మండల కేంద్రానికి వచ్చి చిన్న పనులు చేస్తూ, మందుకు బానిసై భార్య, పిల్లలను నిత్యం వేధించేవాడు. కాగా గురువారం రాత్రి అతిగా మద్యం తాగి రాజేశ్వర్ భార్య, కూతురిని కొట్టడంతోపాటు వేధించడంతో మనస్తానికి గురై, శారద, స్పందన, రఘువరున్ గ్రామశివారులోని బావి వద్దకు వచ్చారు. రఘువరుణ్‌కు శారద వాడుతున్న సెల్‌ఫోన్ ఇచ్చి నువ్వు ఇంటికి వెళ్లు అని చెప్పి, కూతురు చెయ్యిపట్టుకొని బావిలో దూకారు. దీంతో భయానికి గురై రఘువరణ్ ఇంటికివెళ్లి ఇంటి చుట్టు పక్కల వారికి విషయం చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. బావిలో జాలరులు, రెస్క్యూ టీం సహాయంతో వెతుకగా శారద మృతదేహం దొరికింది. స్పందన మృతదేహం కోసం తీవ్రంగా గాలించగా, మధ్యాహ్నం లభ్యమైంది. వీరి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

**మిన్నంటిన రోదనలు**

తల్లి, కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. స్పందన స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది స్పందన మృతిచెందిన విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతిరాలి తల్లి వడ్నాల రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.


బయటకు వెలికితీసిన మృతదేహాలు

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం


17వ వార్డులో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్ ఆకులరజితా వెంకన్న

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 20: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 7,18వ వార్డులో స్వచ్ఛత హీసేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మొక్కలకు నీళ్లుపోసి పెంచేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఇంట్లోని చెత్తను తప్పనిసరిగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని చైర్‌పర్సన్ సూచించారు. వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, వార్డు కౌన్సిలర్లు చిత్తారి పద్మ, మిర్యాల రమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వనమహోత్సవ సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వా ర్డు అధికారులు ప్రసాద్, శివసాయి, సాంబరాజు, బేసిల్ ఫౌండేషన్ సభ్యులు ఉదయ్, నవీన్, మెప్మా ఆర్పీలు జగదీశ్వరి, పద్మతో పాటు పలువురు ఉన్నారు.

**విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి**

హుస్నాబాద్, సెప్టెంబర్ 20 : విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడలపై కూడా ఆసక్తిని పెంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఎంఈవో దేశిరెడ్డి, కేడం లింగమూర్తి, ఎండీ హసన్, పాఠశాల హెచ్‌ఎం వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శిస్తే సహించం


మిరుదొడ్డి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 20 : ప్రజల మనిషి తెలంగాణ ఉద్యమ నాయకుడు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ మిరుదొడ్డి టౌన్ అధ్యక్షుడు ధర్మారం బాబు, మొగుళ్ల ఐలయ్య హెచ్చరించారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో ఉండి ఎంపీపీ పదవిని అనుభవించి కాంగ్రెస్‌లో చేరిన సాయిలు మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. మిరుదొడ్డిలో పెట్టిన రైతు ధర్నాకు రైతులు స్వయంగా వచ్చారని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేయకుంటే కాంగ్రెస్‌ను వదిలి పెట్టమని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సిరినేని వెంకటయ్య, సాయికుమార్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వట్టిపల్లిలో సఫాయి కార్మికుడు మృతి

జగదేవపూర్ సెప్టెంబర్ 20 : మండలంలోని వట్టిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సఫాయి కార్మికుడు మాచర్ల మల్లేశం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో ఖాజామోహినొద్దీన్, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు శుక్రవారం మల్లేశం మృతదేహం వద్ద నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. పంచాయతీ తరుపున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పంచాయతి కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో రూ. 6500 నాగరాజు అందించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరుణ్ కుమార్, కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు శైలేశ్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కార్యదర్శు లు నాగరాజు, విక్రం, నవీన్, సాయిబాబా, రేఖ, ఐలేని, కార్తిక్, బాణు, వెంకటేశం ఉన్నారు.

## మున్సిపల్ రోజువారి కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిద్దిపేట, సెప్టెంబర్ 20 : సిద్దిపేట మున్సిపల్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, ఎన్‌ఎంఆర్.. డైలీ వేజ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఆర్వోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజయ్య, నర్సింహులు, వినోద్, బాల్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి

దుబ్బాక, సెప్టెంబర్ 20 : మక్క చేనులో కూలి పనులకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలీ పాము కాటుతో మృతి చెందిన విషాద సంఘటన శుక్రవారం దుబ్బాక మండలం అప్పనపల్లిలో జరిగింది. వివరాలోకి వెళితే.. అప్పనపల్లి గ్రామానికి చెందిన గ్యార భూలక్ష్మి (40). గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. శుక్రవారం గ్రామానికి చెందిన చెర్లపల్లి రాజిరెడ్డికి చెందిన మక్క చేనులో కంకులు కోసేందుకు కూలీ పనులకు వెళ్లింది. చేనులో పని చేస్తుండగా భూలక్షికి పాము కాటు వేసింది. మృతురాలి తల్లి గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు దుబ్బాక ఎస్సై గంగారాజు తెలిపారు.

## పాల బిల్లులను విడుదల చేయాలి


వినతి పత్రాన్ని అందిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 20 : తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డిని హైదరాబాద్‌లో సిద్దిపేట జిల్లా విజయ పాల డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పాడి రైతులు విక్రయించిన పాల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరామన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో విజయ డెయిరీ చైర్మన్లు ఉన్నారు.

## కమ్యూనిస్టు పోరాటాలతోనే సాకారం


గజ్వేల్ సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్, సెప్టెంబర్ 20 : కమ్యూనిస్టుల పోరాటాలు నాలుగున్నర వేల కమ్యూనిస్టుల బలిదానాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గజ్వేల్ మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముగింపు ఉత్సవాల్లో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని ఒకరు ప్రజాపాలన అని, మరొకరు సమైక్య దినోత్సవం అని ఎవరి మెప్పు కోసం అంటున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మొహియొద్దీన్, గద్దర్ వీళ్లంతా కమ్యునిస్టు నాయకులే తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసి ప్రాణాలు అర్పించిన వారే అని గుర్తుంచుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు దయానందరెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు రెండు పతకాలు

సిద్దిపేట కమాన్, సెప్టెంబర్ 20 : ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు ఒక వెండి పతకం, ఒక కాంస్య పతకాలు వచ్చినట్లు సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్ తెలిపారు. రాఘవపూర్‌కు చెందిన గ్యార లీలా ఆనంద్ డెకథ్లాన్‌లో వెండి పతకం, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కొండపాకకు చెందిన నగేశ్ అండర్-18 విభాగంలో జావెలియన్ త్రోలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. వీరిని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీ పెటా జిల్లా అధ్యక్షులు ఏర్వ అశోక్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, సంఘ బా ధ్యులు బయ్యారపు కనకారెడ్డి, ప్రభాకర్, కృష్ణ కుమార్, నిషాంక్‌గౌడ్, సాగర్, స్వామి తదితరులు అభినందించారు.

## ఫ్రెషర్స్‌డే హంగామా..

హుస్నాబాద్, సెప్టెంబర్ 20: హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ కందుల శోభాదేవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అటు తల్లిదండ్రులకు, ఇటు చదివిన కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కరుణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానందం, లక్ష్మ య్య, సంపత్, కవిత, రాజేంద్రప్రసాద్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల నిర్వాహణ కష్టాలను తీర్చాలి

మర్కూక్, సెప్టెంబర్ 20 : మండలంలోని గ్రామపంచాయతీలకు వెంటనే నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరుతూ శుక్రవారం మర్కూక్ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు మెమోరాండం సమర్పించారు. రాష్ట్రంలో ఏడాదిగాలేని సమస్యలు కేవలం పంచాయతీ కార్యదర్శులకే పనిభారం, నిధులలేమి, వేతనాల సమస్యలున్నాయని వెంటనే కార్యదర్శుల సమస్యలతో రాబోయే బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణకు నిధులను విడుదలచేయాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## నెట్‌వర్క్ లేక ఖాతాదారుల ఇబ్బందులు

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 20 : కొండపాక మండలంలోని దుద్దెడ యూనియన్ బ్యాంకులో రెండు రోజులుగా నెట్‌వర్క్ పనిచేయడంతో బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. దీంతో బ్యాంకు అధికారులు బ్యాంకు ముందు నో నెట్‌వర్క్ బోర్డు వేయడంతో ఖాతాదారులు తీవ్రఇబ్బందులు పడ్డారు.

## ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 20 : మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శకుంతల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో పీజీటీ-సివిక్స్, టీజీటీ- ఇంగ్లిష్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులకు నేటితో గడువు ముగియనున్నట్లు తెలిపారు.

## జామా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 20 : మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని స్థానిక జామా మసీదులో నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త బడుగుల కోసం, కష్టజీవుల కోసం చేసిన త్యాగాలు గుర్తుచేశారు. మాతృమూర్తి గొప్పతనాన్ని సమాజానికి చాటిచెప్పిన మహనీయుడు ప్రవక్త అని మత గురువు రుహుల్ అమీన్ బోధించారు. భానిసత్వానికి వ్యతిరేకంగా, మూఢనమ్మకాలను ప్రారదోలేందుకు ఆయన చేసిన సేవలను గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా 500 మందికి అన్నదానం నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు భాషుమియా, ప్రధాన కార్యదర్శి ఎండీ. హసన్, ఎండీ అయూబ్, ఎండీ ఫసీయొద్దీన్, దస్తగిరి, శాబీర్, ముం తాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఒకరిని వదిలి మరొకరు ఉండలేక..

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 20: మృత్యువులోనూ వీడలేదు.. ఈ భార్యాభర్తలు.. ఒకరిని విడిచి మరొకరు ఉండలేక ఒకే గూటికి చేరారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన గాలిపెల్లి రఘునాథం(73) గాలిపెల్లి సుభద్ర దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుభద్ర ఈనెల 7న మృతిచెందింది. భార్య మృతిచెందినప్పటి నుంచి భర్త రఘునాథం తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. భార్యమృతిచెందిన మరుసటిరోజు నుంచి రఘునాథం మాట్లాడలేకపోయాడు. శుక్రవారం భార్య అస్తికలను సేకరించి కాళేశ్వరంలోని నదిలో కలిపేందుకు బయలు దేరిన కొద్దిసేపటికి రఘునాథం కన్నుమూశారనే వార్త కుటుంబ సభ్యులను తీవ్రమైన వేదనకు గురిచేసింది. తల్లిమరణం నుంచి కోలుకోకముందే తండ్రి మృతిచెందడంతో పిల్లలు, బంధువుల రోదనలు మిన్నం టాయి.

## ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 20 : ధూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ముగిశాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. పోటీ ల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలను ఎంపిక చేసి, జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నారు.